చిరుత కాదు.. అడవి పిల్లి



శంషాబాద్ రూరల్, జూన్ 26 : ఘాన్సీమియాగూడలో నాలుగు రోజులుగా సంచరిస్తున్నది చిరుత కాదు.. అడవి పిల్లి అని తెలియడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం రాత్రి ట్రాప్ కెమెరాలో అడవి పిల్లి కనిపించిందని అటవీ శాఖ అధికారులు నిర్ధారణకు వచ్చారు. దాంతో అధికారులు, ఘాన్సీమియాగూడ రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, అధికారులు 2 బోన్లు, 10 ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేసి నాలుగు రోజులుగా అది చిరుతనా? హైనానా? అడవి పిల్లినా? అని తెలుసుకునేందుకు తీవ్ర యత్నం చేశారు.



చేవెళ్ల బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

- స్కూల్ టైంలో బస్సులు లేక విద్యార్థుల ఇక్కట్లు .. కనిపించని పల్లెవెలుగు
- విద్యార్థులకు పాస్ ఉండడంతో ఆర్డినరీ బస్సుల కోసం వెయిటింగ్
- ఎన్నీ ఎక్స్‌ప్రెస్ నడవడంతో.. అందులో చెల్లని పాస్
- స్కూల్, కాలేజీ సమయానికి చేరుకోలేక అవస్థలు
- బస్సులు లేక నడిచి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

పల్లెల్లో.. ప్రయాణ కష్టాలు!

పెరిగిన రద్దీ.. తగ్గిన బస్సులు


పల్లెల్లో ప్రయాణ కష్టాలు రాజ్యమేలుతున్నాయి. జిల్లాలో అనేక గ్రామాలకు అసలు బస్సు సౌకర్యమే లేదు. మరి కొన్ని గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు కాకుండా కేవలం ఎక్స్‌ప్రెస్‌లు మాత్రమే నడుస్తున్నాయి. దీంతో బస్ పాస్‌లున్న విద్యార్థులు, ఉద్యోగులకు వాటిలో ప్రయాణించే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాలకు అసలు ఆర్టీసీ బస్సులే లేకపోవడంతో విద్యార్థులు మూడు, నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని గ్రామాలకు అరకొరగా బస్సులు ఉండడంతో వాటిలోనే కిక్కిరిసి ప్రయాణం చేయాల్సి వస్తోంది. కరోనా కంటే ముందు ఈ గ్రామాలకు బస్సులు నడిపారు. కరోనా సమయంలో గ్రామాలకు బస్సు సౌకర్యం రద్దు చేశారు. మళ్లీ వాటిని పునరుద్ధరించకపోవడంతో అనేక గ్రామాల ప్రజలు ప్రయాణానికి అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి దాపురించింది.

బస్‌పాస్ ఉన్నా ఉపయోగం లేదు



బస్‌పాస్ ఉన్నా ఉపయోగం లేకుండా పోతోంది. ప్రతీ రోజు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తుంది. డీలక్స్, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు వస్తున్నాయి. కానీ.. పల్లె వెలుగు బస్సులు రావడం లేదు. కాలేజీ సమయం గడిచి పోతుండటంతో ఎక్స్‌ప్రెస్‌కు డబ్బులు చెల్లించి వెళ్లాల్సి వస్తుంది. ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు ఆర్డీనరీ బస్సులు నడిపించాలి.

- వి.సాయిదీపక్, ఇంటర్ విద్యార్థి, చేవెళ్ల



ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణిస్తున్న విద్యార్థులు



రంగారెడ్డి అర్బన్ (ఆంధ్రజ్యోతి), జూన్ 26 : ఉదయం పూట ఆఫీసులకు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లేవాళ్లు చాలా మంది ఆర్టీసీ బస్సుల ద్వారానే ప్రయాణాలు సాగిస్తున్నారు. విద్య, వైద్యం, బిజినెస్ ఇక ఏదైనా హైదరాబాద్‌కు వెళ్లేవారి సంఖ్యే అధికం. వీరిలో ఎక్కువగా ఆర్టీసీ బస్‌పాసులపై ఆధారపడి ఉన్నవారే. ఇక ఉద్యోగుల సంఖ్య చెప్పనక్కర లేదు. ప్రయాణికులకు, నడుపుతున్న బస్సులకు ఏమాత్రం పొంతన లేకపోవడంతో.. ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి పోతున్నాయి. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని అమల్లోకి తీసుకు రావడంతో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగింది. పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో కనీసం నిల్చునే పరిస్థితి కూడా ఉండటం లేదు. చేవెళ్ల బస్‌స్టేషన్‌లో ఉదయం 7 గంటల నుంచి 8-30 వరకు, సాయంత్రం 3.50 గంటల నుంచి 5 గంటల వరకు రద్దీ భయంకరంగా ఉంటుంది. చేవెళ్ల ప్రాంతంలో ఇంజనీరింగ్, ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు 72కు పైగానే ఉన్నాయి. అలాగే ప్రైవేట్ స్కూల్స్ పది వరకు ఉంటాయి. దీన్ని బట్టి చూస్తే విద్యార్థుల సంఖ్య ఏ మేరకు ఉందో ఇట్టే అర్థం చేసుకవచ్చు. ఉదయం, సాయంత్రం విద్యార్థులు ఫుట్‌బోర్డులపై నిలబడి ప్రయాణం చేస్తున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి 7.30 గంటల వరకు చేవెళ్ల బస్‌స్టేషన్‌లోకి వస్తున్న బస్సులన్నీ డీలక్స్ ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లే ఉన్నాయి. విద్యార్థులకు పాస్ ఉండటంతో వాటిలో ఎక్కే పరిస్థితి లేదు. పల్లె వెలుగు, ఆర్డీనరీ బస్సులు రావడం లేదు. ఒకవేళ వచ్చినా... ఒకే బస్సులో కిటకిటలాడుతోంది.

నెరవేరని హామీలు..


చేవెళ్లలో బస్‌డిపో నిర్మాణంపై ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీ నెరవేరనే లేదు. ప్రభుత్వాలు మారుతున్నాయి... పాలకులు మారుతోన్నారు.. కానీ.. బస్సు డిపో నిర్మాణంపై నేతలు ఇచ్చిన హామీలను కలగానే మిగిలిపోతున్నాయి. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ప్రస్తుత ఎమ్మెల్యే కాలె యాదయ్య ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చకుండానే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక జిల్లా నుంచి అప్పటి తాండూరు ఎమ్మెల్యే డాక్టర్ పి. మహేందర్‌రెడ్డికి రాష్ట్ర కేబినెట్‌లో స్థానం లభించింది. రాష్ట్ర రవాణశాఖ మంత్రి హోదాలో చేవెళ్లకు వచ్చిన మంత్రి మహేందర్‌రెడ్డి పలు మార్లు చేవెళ్ల బస్‌డిపో గురించి మాట్లాడారు. బస్ డిపో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామీ నేటికి కార్యరూపం దాల్చనే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. ఇప్పుడైనా బస్‌డిపో వస్తుందా? అన్న అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

శంషాబాద్‌లో కలగా మారిన బస్ డిపో నిర్మాణం

శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్నప్పటికీ అక్కడ బస్ డిపో లేదు. ఏళ్ల తరబడి నేతలు హామీలు ఇవ్వడమే కానీ.. నిర్మాణం కోసం కృషి చేసిన నాథుడే లేదు. నాటి దివంగత మంత్రి ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రకాశ్‌గౌడ్ హామీ ఇచ్చారు. వారిచ్చిన హామీ ఇంతవరకు నెరవేరలేదు. రషీద్‌గూడలో రెండుచోట్ల భూమి కేటాయించారు. కానీ నిధులు మంజూరు కాలేదు.

ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్‌లో ఆర్టీసీ బస్సు డిపో ఉంది. కానీ, బస్సుల కొరత తీవ్రంగా ఉంది. గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడవడం లేదు. కేశంపేట మండలం లింగంపల్లి, కాకునూరు, కొత్తపేట, నందిగామ మండలం మేకగూడ గ్రామాలకు బస్సులు బందయ్యాయి. స్కూల్ టైంకు బస్సులు లేక పోవడంతో విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. షాద్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు రాత్రి 7 గంటలు దాటితే బస్సులు లేవు. కొత్త బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.



మధ్యలోనే నిలిచిపోయిన చేవెళ్ల బస్‌స్టేషన్ పనులు

చదువుకోవాలంటే నడిచి వెళ్లాల్సిందే..



మల్కీజ్‌గూడ నుంచి మేడిపల్లి పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

యాచారం : విద్యార్థులు చదువుకోసం మూడున్నర కిలోమీటర్లు నడిచి వెళ్తున్నారు. చిన్నారులు పుస్తకాల సంచులు భుజానికి వేసుకొని ఆ బరువుతో బడికి నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో చిన్నారులకు ఈ కష్టాలు ఎదురవుతున్నాయి. యాచారం మండలం మల్కీజ్‌గూడ విద్యార్థులు కడ్తాల మండలం మేడిపల్లి ఉన్నత పాఠశాలకు నాలుగు కిలోమీటర్లు నడిచి వెళుతున్నారు. తాటిపర్తి నుంచి కుర్మిద్ద ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు మూడు కిలోమీటర్లు నడిచి వెళ్తున్నారు. కుర్మిద్ద నుంచి కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట వరకు మూడు కిలోమీటర్ల మేర, అయ్యవారిగూడ నుంచి నందివనపర్తి వరకు రెండున్నర కిలోమీటర్లు, చౌదర్‌పల్లి నుంచి యాచారం మండల కేంద్రం వరకు విద్యార్థులు నడుచుకుంటూనే పాఠశాలకు వెళ్తున్నారు. ఆర్టీసీ అధికారులు కరోనాకు ముందు ఈ గ్రామాలకు బస్సులు నడిపేవారు. కరోనా సమయంలో బస్సులు బంద్ చేశారు. అప్పటి నుంచి తిరిగి బస్సు సౌకర్యం కల్పించలేదు. తమ గ్రామాలకు తిరిగి ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని అధికారులకు, ప్రజాపతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆ గ్రామాల మాజీ సర్పంచులు రమేష్, రాజశేఖర్‌రెడ్డిలు ఆందోళన వ్యక్తం చేశారు.

ఉదయం సాయంత్రం వేళ బస్సు వేయండి



ప్రతీ రోజు మల్కీజ్‌గూడ నుంచి మేడిపల్లి పాఠశాలకు ఉదయం సాయంత్రం వేళ నడచుకుంటూ పోతున్నాం, ఒక్కోసారి విషసర్పాలను చూసి భయంతో జ్వరాల బారిన పడుతున్నాం. వర్షం కురిస్తే పాఠశాల నుంచి ఇంటికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. కరోనాకు ముందు బస్సు వచ్చేది. ఇప్పుడెందుకు రావడం లేదో అర్థం కావడం లేద. అధికారుల పిల్లలు కూడా నడచుకుంటూ బడికి పోతున్నారా..? మరి మాకెందుకు ఈ సమస్య చెప్పండి.

- ప్రవళిక, విద్యార్థిని, మేడిపల్లి పాఠశాల

'ధరణి'లో భూమి ఎక్కించడం లేదని..

- ఒంటిపై పెట్రోల్ పోసుకొని రైతు ఆత్మహత్యాయత్నం
- వారించి బాటిల్ లాక్కొన్న పోలీసులు.. తల్లిదండ్రులతో కలిసి నిరసన
- శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఘటన



తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోల్ బాటిల్‌తో సూరిబాబు, అతడి తల్లిదండ్రులు

శంషాబాద్, జూన్ 26 : తమ భూమిని 'ధరణి' రికార్డుల్లో ఎక్కించాలని ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్‌కు చెందిన చెన్నకేశవ లక్ష్మయ్య, కమలమ్మ దంపతులకు మండల పరిధిలోని ఘన్సిమియాగూడ రెవెన్యూ పరిధిలో 8 ఎకరాల భూమి ఉంది. అయితే, ఇంతకుముందు ఆ భూమిని తమ పేరుపై ధరణి పోర్టల్‌లో నమోదు చేయాలని విన్నవించినట్లు బాధితులు తెలిపారు. రెవెన్యూ అధికారులకు దరఖాస్తు కూడా చేసుకున్నారు. అయితే, అధికారులు తమ పేరును రికార్డుల్లో ఎక్కించడం లేదని లక్ష్మయ్య, కమలమ్మ దంపతులు తమ కుమారుడు సూరిబాబుతో కలిసి బుధవారం శంషాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈక్రమంలో వారు కార్యాలయానికి వస్తూ.. బాటిల్‌లో పెట్రోల్‌ను వెంట తెచ్చుకున్నారు. భూమిని ధరణి రికార్డుల్లో ఎక్కించాలని సూరిబాబు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. అక్కడే ఉన్న పోలీసులు అతన్ని అడ్డుకొని పెట్రోల్ బాటిల్ లాక్కొని అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఈ సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. ఈ విషయమై తహసీల్దార్ నాగమణిని వివరణ కోరగా.. వారి భూమిని ధరణి రికార్డుల్లో ఎక్కించమని దరఖాస్తు చేసుకున్నారని, పరిశీలనలో ఉందని వివరణ ఇచ్చారు. అయితే, ఈ సంఘటనకు తనకు ఎలాంటి సంబంధంలేదని ఆమె వివరణ తెలిపారు.

నిర్మాణం పూర్తయి.. ఎనిమిది నెలలైనా..!

- ప్రారంభానికి నోచుకోని కొత్తూర్ గ్రంథాలయం
- బిల్లులు రాలేదని తాళం వేసుకున్న కాంట్రాక్టర్
- అద్దె భవనంలోనే కొనసాగింపు

కొత్తూర్, జూన్ 26: గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ఎనిమిది నెలలు పూర్తవుతున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. కాంట్రాక్టర్‌కు బిల్లు రాకపోవడంతో ఏకంగా తాళం వేసుకుని పోవడంతో ప్రస్తుతం గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. మండల కేంద్రంలోని పాత గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో గత ప్రభుత్వం 2022లో నూతన భవనానికి 75లక్షల రూపాయలను మంజూరు చేసింది. అప్పటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. గ్రంథాలయ భవనానికి 75లక్షల రుపాయల మంజూరు కాగా, సదరు కాంట్రాక్టర్ అదనంగా మరో 17లక్షలు వెచ్చించి భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. అదనంగా ఖర్చు చేసేందుకు జిల్లా గ్రంథాలయ అధికారుల అంగీకారం కూడా కాంట్రాక్టర్ పొందారు. దాదాపు 8నెలల క్రితం గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తి చేసిన కాంట్రాక్టర్ తాను వెచ్చించిన 17లక్షల రూపాయలను మంజూరు చేయాలని కార్యాలయాల చుట్టూ తిరిగాడు. ఫలితం లేకపోవడంతో కాంట్రాక్టర్ గ్రంథాలయ భవనానికి తాళం వేసుకుని వెళ్లిపోయాడు. రెండు సంవత్సరాల నుంచి గ్రంథాలయం అద్దె భవనంలో ఇరుకు గదులతో కొనసాగుతుండడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దె భవనంలో అరకొర వసతులు ఉండడంతో పుస్తకాలు నిరుపయోగంగా ఉన్నాయి. గ్రంథాలయానికి వచ్చిన కాంపిటీషన్ బుక్కులు బీరువాలకే పరిమితమయ్యాయి. గ్రంథాలయ నూతన భవనాన్ని బుధవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించగా, నూతన భవనానికి వేసిన తాళం చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. అక్కడే ఉన్న గ్రంథాలయ అధికారి జీవీ శ్రీనివాస్ రాజును వివరాలు అడిగి తెలుసుకున్నాడు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే నూతన భవనాలు ప్రారంభానికి నోచుకోవడం లేదని ఎమ్మెల్యే అవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు రావాల్సిన బిల్లును వెంటనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని గ్రంథాలయ భవనం

వెంటనే గ్రంథాలయాన్ని ప్రారంభించాలి



నూతన గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తి చేసుకుని నెలల గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం అరకొర వసతులు ఉండడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ, యువకులకు నిరాశే ఎదురవుతోంది. అధికారులు వెంటనే స్పందించాలి.

- నరేష్‌చారి, ఏబీవీపీ మండల కన్వీనర్, కొత్తూరు

వసతులు లేక వెళ్లలేక పోతున్నాం




గ్రంథాలయంలో వసతులు సరిగా లేకపోవడంతో అక్కడికి వెళ్లలేకపోతున్నాం. పుస్తకాలు చదువుకుందామంటే అక్కడ ప్రశాంతత లేకుండా పోతుంది. అన్ని వసతులతో గ్రంథాలయం నిర్మించినా నిరుపయోగకరంగా ఉంది. నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభిస్తే విద్యార్థులకు, యువతీ, యువకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- సుమిత్‌కుమార్, విద్యార్థి, కొత్తూర్

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

మహేశ్వరం, జూన్ 26 : యువత డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి చక్కని జీవితాలను చిత్తు చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం మహేశ్వరంలో పోలీసులు విద్యార్థులతో కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఒకప్పుడు పెద్ద నగరాలకే పరిమితమైన డ్రగ్స్ మహమ్మారి ఇప్పుడు గ్రామస్థాయి వరకు పాకిందన్నారు. దీంతో యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, పోలీసులతో పాటు ప్రతీ ఒక్కరు కలిసికట్టుగా పోరాడితే డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. ఎవరైనా డ్రగ్స్, మత్తు పదార్థాలు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ర్యాలీలో పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు పలువురు ఉపాధ్యాయులు, ఎస్ఐలు రవీందర్, వెంకట్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి మండలానికి భారీగా నిధులు కేటాయించాం

బంట్వారం,(కోట్‌పల్లి), జూన్ 26:నూతనంగా ఏర్పడ్డ కోట్‌పల్లి మండలానికి అత్యధికంగా నిధులు కేటాయించామని జెడ్పీచైర్ పర్సన్ సునీతారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో రూ.25లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కోట్‌పల్లి మండలాన్ని ఇంకా అభివృద్ధి చేయాలన్నారు. అభివృద్ధికి స్పీకర్ ప్రసాద్‌కుమార్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకరించాలని కోరారు. తనను జెడ్పీటీసీగా ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ ధారసింగ్, నాయకులు అంజయ్య, విజయలక్ష్మి, బందెయ్య, నర్సింగ్, సతీష్, మాల్‌రెడ్డి, రమేష్‌రాజు, శ్రీనివాస్ చర్చి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

మండల అభివృద్ధికి కృషి

బషీరాబాద్: వెనకబడిన మండలానికి నిధులు కేటాయించానని జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. మండల చివరి సర్వసభ్య సమావేశం ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ అధ్యతన జరుగగా చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. చైర్‌పర్సన్ ప్రసంగిస్తూ తాను చైర్ పర్సన్‌గా ఎన్నికైన తర్వాత మండలానికి రూ.కోట్లలో నిధులు మంజూరు చేశానని తెలిపారు. ఎమ్మెల్యే మట్లాడుతూ మండలానికి జూనియర్ కాలేజీని తీసుకొచ్చామన్నారు. సీఎం సహకారంతో ఈ సారి కళాశాల ప్రారంభించి అధ్యాప కులను నియమించామన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణామఫీ ఆగస్టు 15లోపు చేసేందుకు సీఎం కట్టుబడి ఉన్నారన్నారు. అంతకు ముందు పలు అంశాలపై సభ్యులు జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహించి ముగించారు. అన ంతరం ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, వైస్‌ఎంపీపీ జడల అన్నపూర్ణ, ఎంపీటీసీలకు చివరి సమావేశం కావడంతో జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే శాలువా, పూలమాలతో వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో నవాంద్గీ ప్యాక్స్ చైర్మన్ ఎ.వెంకట్‌రాెడ్డి, తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంపీడీవో రాఘవులు, ఎంపీవో రమేష్, వివిధ శాఖల అధికారులు పలువురు పాల్గొన్నారు.

సహకార సంఘాలను తీర్చిదిద్దాలి

శామీర్‌పేట, జూన్ 26 : ఉమ్మడి జిల్లాలోని రైతు సహకార సంఘాలకు బాధ్యతగా సేవలందించేందుకు సొసైటీల చైర్మన్లు కృషిచేయాలని జిల్లా కేంద్ర సహకార సంఘం బ్యాంక్ చైర్మన్ సత్తయ్య అన్నారు. శామీర్‌పేట ప్యాక్స్ చైర్మన్, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి రైతులకు ఉత్తమ సేవలందిస్తూ రైతులు, ఇతరులు తీసుకున్న రుణాలను అత్యధిక శాతం రికవరీ చేసినందుకు 2023-24కు ఉత్తమ చైర్మన్‌గా ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని డీసీసీబీ భవనంలో రైతులతో మహాజన సభను నిర్వహించారు. మధుకర్‌రెడ్డిని సన్మానించారు. శామీర్‌పేట రైతు సొసైటీ సీఈవో నర్సింలును, డైరెక్టర్లను, సిబ్బందిని కూడా అభినందించారు. కార్యక్రమంలో సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



మధుకర్‌రెడ్డికి సేవా పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలి

వికారాబాద్. జూన్ 26: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్లో(హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్) నాలుగో తరగతిలో ప్రవేశాలకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో విద్యార్థుల ఎంపిక పోస్టర్‌ను కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం విడుదల చేశారు. జిల్లాలోని బాల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోస్టర్ విడుదలలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి హనుమంతరావు, డీపీఆర్వో చెన్నమ్మ, మత్స్యశాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

'పార్క్ జోలికొస్తే ఖబర్దార్'

వికారాబాద్. జూన్ 26:బీటీఎస్ కాలనీ పార్కును కాపాడాలని, దాని జోలికి వస్తే ఊరుకునేది లేదని బీటీఎస్ కాలనీ కౌన్సిలర్ అర్థ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం 33వార్డు బీటీఎస్ కాలనీలో పార్కు కబ్జాపై కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు, కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. అధికారులతో సమావేశం నిర్వహించి పార్క్ విషయంలో మాట్లాడుతానని ప్రసాద్‌కుమార్ హామీ ఇచ్చారు. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ రమేష్, కాలనీ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం తేవాలి

● జడ్పీటీసీతో మాజీ సీఎం కేసీఆర్

శామీర్‌పేట, జూన్ 26: మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి పూర్వవైభవం తేవాలని మాజీ సీఎం కేసీఆర్ జడ్పీటీసీ అనితకు సూచించారు. బుధవారం ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆధ్వర్యంలో జడ్పీటీసీ, నాయకులు సిద్దిపేట జిల్లాలోని కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.



రేషన్ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

తాండూరు, జూన్ 26: తాండూరు నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న 18 చౌక ధరల దుకాణ డీలర్ల నోటిఫికేషన్ జారీ చేశామని ఆర్డీవో శ్రీనివాస్‌రావు బుధవారం తెలిపారు. జులై 3వ తేదీ వరకు దరఖాస్తులను ఆర్డీవో కార్యాలయంలో స్వీకరిస్తామన్నారు. పది దినాలలో సాయంత్రం 5:30గంటల వరకు అందజేయొచ్చన్నారు. బషీరాబాద్ మండలం కంసాన్‌పల్లి(బి) దుకాణానికి జనరల్ లేడీ, పెద్దేముల్ మండలం గోపాల్‌పూర్, ఆత్కూర్ గ్రామాలకు ఎస్టీ జనరల్, ఖానాపూర్‌కు జనరల్ మహిళ, తాండూరుమండలం మిట్టబాస్పల్లి దుకాణానికి బీసీ-డి మహిళ, రాంపూర్ దుకాణానికి బీసీ-ఈ మహిళ, సంగెం కలాన్ బీసీ-ఎ, తాండూరులో షాప్ నం: 4116031కు జనరల్, షాప్ నం: 4116034కు ఎస్సీ లేడీ, షాప్ నం: 4116035కు జనరల్ మహిళ, షాప్ నం:4116036కు బీసీ-బి, యాలాల మండలం ముకుందాపూర్ షాప్ ఎస్టీకి, కోకట్ జనరల్, రాఘవపూర్ ఎస్సీ, ఖానాపూర్ జనరల్, పగిడ్యాల్ దుకాణానికి బీసీ-ఎ, బాగాయిపల్లి దుకాణానికి జనరల్ లేడీ, ఇందిరమ్మ కాలనీకి బధిరులు(జనరల్)కు కేటాయించామని ఆర్డీవో వివరించారు. అభ్యర్థులు ఆయా గ్రామవాసులై, కనీసం పదో తరగతి పాసై ఉండాలన్నారు. 18 నుంచి 40ఏళ్ల మధ్య వయస్సు ఉండాలని, రాత పరీక్ష, ఇంటర్వ్యూ తేదీలను ప్రకటిస్తామని ఆర్డీవో తెలిపారు.



ఆర్డీవో శ్రీనివాస్‌రావు

2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

వికారాబాద్, జూన్ 26: 2008 డీఎస్సీలో క్వాలిఫైడ్ ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు బుధవారం హైదరాబాద్‌లో ప్రొఫెసర్ కోదండరాంకు ఆయన నివాసంలో వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. 2008డీఎస్సీలో ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు పరీక్షకు అనుమతివ్వకపోవడంతో కోర్టును ఆశ్రయించి డీఎస్సీ పరీక్ష రాశామన్నారు. సెలక్షన్ అయినా తమను విత్ హెల్డ్‌లో పెట్టారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంతోనైనా చర్చించి తమకు న్యాయం చేయించాలని కోరారు. కోదండరామ్ సానుకులంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.



కోదండరాంకు వినతిపత్రం ఇస్తున్న డీఎస్సీ డీఎడ్ అభ్యర్థులు

నిబంధనలు పాటించని ఏడు క్లినిక్‌లు సీజ్

శంకర్‌పల్లి, జూన్ 26: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆసుపత్రులు, క్లినిక్‌లపై జిల్లా వైద్యాధికారులు కొరడా ఝుళిపించారు. శంకర్‌పల్లిలో దాడులు చేసి ఏడు క్లినిక్‌లను సీజ్ చేశారు. జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఉపవైద్యాధికారి దామోదర్‌ల బృందం శంకర్‌పల్లిలో బుధవారం సాయత్రం తనిఖీ చేస్తుండగా విషయం తెలుసుకున్న కొందరు ఆర్‌ఎంపీ డాక్టర్లు తమ క్లినిక్‌లను బంద్ చేసుకొని వెళ్లారు. వెంకటేశ్వర, సంపత్, దివ్య బాలాజీ క్లినిక్‌లను సీజ్ చేశారు. ప్రథమ చికిత్స చేయాల్సిన ఆర్‌ఎంపీ లు నిబంధలకు విరుద్ధంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యం చేస్తుండంతో వీటిని సీజ్ చేశారు. శ్రీనివాస సేవానికేతన్ క్లినిక్ పత్రాలు సక్రమంగా లేకపోవడంతో సీజ్ చేశారు. నాటు వైద్యం చేస్తున్న ప్రజ్వల్‌బోన్, బాలాజీ బోన్ సెట్టింగ్స్ సెంటర్లను సీజ్ చేశారు. స్వరాజ్ ఆసుపత్రిలో లేబర్ గది, ఆపరేషన్ థియేటర్‌లో నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వైద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయ మెడికల్ కౌన్సిల్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌ల ఆదేశాల మేరకు ఆసుపత్రులను తనిఖీ చేయడం జరుగుతున్నదన్నారు. జిల్లావ్యాప్తంగా నిర్వహణ సక్రమంగా లేని 13 ఆసుపత్రుకు అపరాధ రుసుం వేయడం జరిగిందని వివరించారు. ఆర్ ఎంపీలు డాక్టర్లు కాదని, వారు డాక్టర్లుగా బోర్డులు పెట్టుకోవద్దని హెచ్చరించారు. ప్రథమ చికత్స మాత్రమే చేయాలని, అర్హతకు మించిన వైద్యం చేయకూడదన్నారు. గోకుల్ ఆసుపత్రి డాక్టర్ కుమార్, లలిత క్లినిక్ డాక్లర్లు లింగారెడ్డి, నవీనలకు సరైనపత్రాలు లేనందున నోటీసులందజేశారు. సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, డాక్టర్లు ఉన్నారు.





స్వరాజ్ క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో, శ్రీ బాలాజీ క్లినిక్‌ను సీజ్ చేసిన అధికారులు

నేడు కుర్మిద్దలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ కమిటీ మాజీ సభ్యుడి పర్యటన

యాచారం, జూన్ 26 : ఫార్మాసిటీ భూ బాదిత గ్రామమైన కుర్మిద్దలో గురువారం మహారాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ కమిటీ మాజీ సభ్యుడు హెచ్‌ఎం. దేశ్‌రథ, సామాజికవేత్త కవుల సరస్వతీలు పర్యటించనున్నారు. ఈమేరకు వారు ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులు నేడు ఏం చేసి జీవనం సాగిస్తున్నారు? భూములు తీసుకున్న ప్రభుత్వం పూర్తి స్థాయిలో పరిహారం అందించిందా? భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి సాయమందిస్తే బాగుంటుంది. భూములు పూర్తిగా కోల్పోయిన రైతులకు తిరిగి భూములు పంచాలా? వద్దా? గతంలో తీసుకున్న పరిహారం సరిపోయిందా? ఇంకా అందించాలా? తదితర అంశాలను వారు రైతులతో సమావేశమై తెలుసుకుంటారని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. మెగాటౌన్ షిప్ ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి కలుగుతుందని నమ్మకం ఉందా? అని వారు రైతులను అడిగి తెలుసుకోనున్నారని కమిటీ తెలిపింది. రైతులతో మాట్లాడిన అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడించనున్నారని తెలిపింది.

నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపవద్దు

చేవెళ్ల, జూన్ 26 : నంబర్లు ప్లేట్ లేకుండా రోడ్లపై వాహనాలు నడిపిస్తే కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. బుధవారం సాయత్రం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రధాన చౌరస్తాల వద్ద ట్రాఫిక్ పోలీస్‌ల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా భారీగా తనిఖీ నిర్వహించారు. నెంబర్ ప్లేట్‌లు లేని 12 వాహనాలను సీజ్ చేశారు. చేవెళ్ల ట్రాఫిక్ ఎస్సై విఠల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఉన్నారు.



వాహనాలుల తనిఖీ చేస్తున్న పోలీస్‌లు

అధిక సాంద్రత పద్ధతితో ఎక్కువ దిగుబడి

ఆమనగల్లు, జూన్ 26: పత్తి సాగులో రైతులు అధిక సాంద్రత పద్ధతి పాటించి దిగుబడులు పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్ట ర్ విజయ్‌కుమార్ సూచించారు. పంటల సాగులో రైతులు మారుతున్న కాలానికనుగుణంగా శాస్త్రీయ పద్ధతులు, మెళకువలు పాటించాలని కోరారు. ఆమనగల్లు మండలం కోనాపూర్‌లో బుధవారం వ్యవసాయ శాఖ, రంగారెడ్డి జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆద్వర్యంలో పత్తి పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో అరుణకుమారి అధ్యక్షతన నిర్వహించిన సదస్సు కు శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సుధీర్, ఏడీఏ ఆదిలక్ష్మీలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పత్తిలో అధిక సాంద్రత పద్ధతి, భూసార పరీక్ష, చీడ పీడల నివారణ, దిగుబడుల పెంపుపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పత్తిసాగులో రైతులు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. పంటల సాగులో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఏడీఏ ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఆదునిక సేద్యం రైతులకు శ్రేయోదాయకమన్నారు. సాగులో రైతులు పెట్టుబడులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. చీడ పీడల నివారణలో ఎప్పటికప్పుడు తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈవో లు మీనాక్షీ, రాణి, శివతేజ, సాయిరామ్, విత్తన కంపెనీల డీలర్లు సూర్యప్రకాశ్, కళ్యాణ్, కిరణ్‌కుమార్ రెడ్డి, కేవి. రంగారెడ్డి, దిలీప్, హరికా, సునిల్, రైతులున్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డా.విజయ్‌కుమార్

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



ఆదిభట్ల : డ్రగ్స్ వాడొద్దని తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

- పోలీసు అధికారులు, అధ్యాపకులు
- మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీలు, అవగాహన
- పాల్గొన్న విద్యార్థులు, పోలసులు, యువత

శంషాబాద్, జూన్ 26 : యువత గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కలిగించేందుకు సైబరాబాద్ పోలీసులు బుధవారం సాయంత్రం శంషాబాద్‌లో యువజన, విద్యార్థి సంఘాలతో కలసి ర్యాలీ నిర్వహించారు. శంషాబాద్ పాతపోలీస్‌స్టేషన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ అంగడి బజార్, సిగోల్లపల్లిదర్వాజ, భారత్‌చౌరస్తా, జెండా చౌరస్తా, సిద్దప్పరోడ్డు మహవీర్‌బిల్డర్స్ బస్టాండు, ఎయిర్‌పోర్టుచౌరస్తాల మీదుగా అంబేద్కర్‌చౌరస్తా వరకు కొనసాగింది. డీసీపీ రాజేష్ ఏసీపీ కే.ఎస్ రావ్, సీఐ బాల్‌రాజ్, పోలీసు అధికారులు సిబ్బంది యువ జన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆదిభట్ల : మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు లక్కరాజు రవిందర్‌రావు విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆదిభట్ల మున్సిపాలిటి పరిధిలోని కొంగరకలాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. హెచ్ ఎం రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కొంగరకలాన్‌కు చెందిన విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు లక్కరాజు రవిందర్‌రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఏఏపీసీ చైర్మన్ సునిత, శిగ వీరస్వామి గౌడ్, తదితరులున్నారు.



శంషాబాద్ : ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

యాచారం : యువత డ్రగ్స్ వాడి తమ జీవితాలు పాడు చేసుకోరాదని సీఐ శంకర్‌కుమార్ అన్నారు. యాచారం పోలీసులు మండల కేంద్రంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా బాలాగ్రామ్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎస్సైలు గోపాల్, సత్యనారాయణ, వెంకటనారాయణ తదితరులున్నారు.

షాబాద్ : మత్తుకు బానిస కాకుడదని ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి అన్నారు. హైతాబాద్‌లో వెల్‌స్పన్ కంపెనీలో అంతర్‌రాష్ట్ర కార్మికులతో ప్రతిజ్ఞ చేయించి, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఎస్సైలు నవీన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చేవెళ్ల : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, గుట్కా, మట్కా, జూదం, సిగరేట్, మందు తదితర వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఎస్సై ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు నో చెప్పండి : జిల్లా జడ్జి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు నో చెప్పాలని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థలో ఇంటర్నేషనల్ డ్రగ్ అబ్యూజ్ అండ్ ఇల్లిక్ట్ ట్రాఫికింగ్ డేను పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వల్ల ఆరోగ్యం పాడవుతుందన్నారు. కుటుంబసభ్యులతో ప్రేమానుబంధాలు తగ్గిపోతాయని, ఆర్థిక ఇబ్బందులు మొదలవుతాయని ఆయన అన్నారు. అదేవిధంగా జ్ఞాపకశక్తి తగ్గిపోయి ఏమీ నేర్చుకోలేని స్థితికి చేరుకుంటారన్నారు. మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల దాని బానిసలను నైతికంగా నాశనం చేయడంతో పాటు, శారీరకంగా కూడా ప్రభావితం చేస్తుందన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగ సమస్యను ఎదుర్కొవడానికి కొన్ని పద్ధతులున్నాయని ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

యువకుడు అదృశ్యం



ఏలియా

షాబాద్, జూన్ 26 : యువకుడు అదృష్యమైన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వరంగల్‌కు చెందిన ఆలకుంట్ల ఏలియా (24) మూడు నెలల క్రితం షాబాద్‌కు కేబుల్ పనులు చేయడానికి వచ్చాడు. అయితే, అతడు ఏప్రిల్ 22న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బటయకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అతడికి ఫోన్ చేస్తే రింగ్ అవుతుంది. నెంబర్ 9701750779 ఎవరూ ఎత్తడంలేదు. మామ బక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

కట్టెల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా

ఇబ్రహీంపట్నం, జూన్ 26: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కట్టెల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో బుధవారం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రోడ్డుకు ఒకేవైపు నుంచి వాహనాలను దారి మళ్లించారు. పీఎస్ ముందు రోడ్డు స్పీడ్‌బ్రేకర్లు ఉండడంతో ఓవర్‌లోడ్‌తో ఉన్న లారీ ఎస్ ఆకారంలో స్పీడ్‌బ్రేకర్లను క్రాస్‌చేసే క్రమంలో అదుపుతప్పి పడిపోయినట్లు సమాచారం. ఇబ్రహీంపట్నం చెరువు కొనకట్ట ఉప్పరిగూడ క్రాసింగ్ వద్దకూడా అదేరాత్రి మరో కట్టెల లారీ అదుపుతప్పి పడిపోయింది. ఈ రెండు ప్రమాదాల్లో ఎవరూ గాయపడలేదని పోలీసులు చెప్పారు.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ

- ముగ్గురికి గాయాలు

మొయినాబాద్, జూన్ 26 : రెండు కార్లు ఎదురు ఎదురుగా ఢీకొన్న సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి షాపూర్ గేట్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీస్‌లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చేవెళ్ల నుంచి స్విఫ్ట్ కారు హైదరాబాద్ వెళ్తుంది. మార్గమధ్యలో మొయినాబాద్ మండల పరిధి షాపూర్ గేట్ సమీపంలోకి రాగానే హైదాబాద్ నుంచి చేవెళ్ల వస్తున్న కారు అతివేగంగా రావడంతో రెండు కార్లు బలంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో కార్లు ధ్వసం అయ్యాయి. నగరానికి చెందిన కారులో ఉన్న ముగ్గురికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మొయినాబాద్ పోలీస్‌లు సంఘటన స్థలకు చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

కేశంపేట, జూన్ 26:: చోరీకి పాల్పడిన వ్యక్తులను జైలుకు తరలించిన ఘటన కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మండలం పరిధిలోని లేమామిడికి చెందిన ఏరువ జయమ్మ తన వ్యవసాయ పొలంలో ఆవులను మేపుతుండగా వెనుకాలనుంచి వచ్చి బంగారు పుస్తెలతాడు దోచుకెళ్లిన దొంగలను బుధవారం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. చోరీకి పాల్పడినవారు నగరంలోని మైలార్ దేవునిపల్లికి చెందిన సోమ నరేష్, అతని భార్య బైండ్ల బందుగా గుర్తించి వారి నుంచి బంగారు పుస్తెలతాడును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కేశంపేట ఎస్‌ఐ లింగం తెలిపారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

షాబాద్, జూన్ 26 : అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని నాందార్‌ఖాన్‌పేట్‌లో కిరాణాషాపు యజమాని గంగాపురం మల్లేష్ అక్రమంగా మద్యం అమ్ముతున్నాడని సమాచారం అందగా దాడులు నిర్వహించారు. షాపులో 21 బీరు బాటిళ్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని మల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ప్రొసీడింగ్‌ను అందిస్తున్న జడ్పీటీసీ అనురాధ

ప్రజాభీష్టానికనుగుణంగా పథకాలు అమలు చేయాలి

ఆమనగల్లు , జూన్ 26: ప్రజాభిష్టానికనుగుణంగా ప్రభుత్వాలు పథకాలు రూపొందించి అమలు చేయాలని జడ్పీటీసీ అనురాధపత్యానాయక్ కోరారు. మేడిగడ్డ తండాలో బుధవారం జడ్పీటీసీ పర్యటించారు. అంతర్గత మురుగు కాల్వలు, అబివృద్ధి పనులను పరిశీలించారు. మేడిగడ్డ తండాలో సీసీ రోడ్డు నిర్మాణానికి జడ్పీ నిధుల నుంచి మంజూరైన రూ. 5 లక్షల ప్రొసీడింగ్‌ను స్థానిక మాజీ సర్పంచ్ అమర్‌సింగ్, నాయకులకు అందజేశారు. పరిషత్ నిధుల నుంచి మండలానికి ఇటీవల రూ.16 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. నాయకులు శంకర్, పాండునాయక్, శంకర్ నాయక్, శ్రీను నాయక్, రవీందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురువాలని భజన



చేవెళ్ల, జూన్ 26 : వర్షాలు సమృద్ధిగా కురువాలని గ్రామస్తులు దేవాలయాల్లో భజనలు చేస్తున్నారు. ఈక్రమంలో మండల పరిధిలోని కౌకుంట్లలోగల హనుమాన్ ఆలయంలో గ్రామస్తులు, భజనభక్తులు కలిసి ప్రత్యేక పూజలు చేసి వర్షాలు బాగా కురిసి పంటలు పండేలా వరుణదేవుడు కరుణించాలని కోరారు. ఈ సందర్భంగా భజనలు, కీర్తనలు చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

చేవెళ్ల, జూన్ 26 : గుండాలలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చిందని గుండాల పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆసుపత్రి వైద్యులు శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యపరీక్షలతో పాటు మందులు అందించారు. 360 మంది రోగులకు అన్నిరకాల వైద్యపరీక్షలు చేశారని బుచ్చిరెడ్డి తెలిపారు. వైద్యులు, వైద్యసిబ్బంది ఉన్నారు.

దళిత విద్యార్థికి న్యాయం చేయండి

షాబాద్, జూన్ 26 : దళిత విద్యార్థికి న్యాయం చేయాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బేగరి రాజు అన్నారు. వారు మాట్లాడుతూ.. షాబాద్ మండలంలోని కేసారం గ్రామంలో ఏడవ తరగతి చదువుతున్న యాదగిరిపై దాడి చేయడం దారుణమన్నారు. నిందితుడు మధుసూదన్‌రెడ్డి, కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డిపై కూడా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి చార్జి షీట్ చేయాలని అన్నారు. ఈమేరకు బుధవారం నగరంలోని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు.

శ్యాంసుందర్ కుటుంబ సభ్యులకు భద్రత, ఎక్స్‌గ్రేషియా చెక్కుల అందజేత

ఇబ్రహీంపట్నం, జూన్ 26: 2022 ఫిబ్రవరిలో బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ శ్యాంసుందర్ కుటుంబ సభ్యులకు భద్రత, ఎక్స్‌గ్రేషియా కింద రూ.8 లక్షల చెక్కులను బుధవారం రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లికి చెందిన శ్యాంసుందర్‌కు భార్య లిఖిత, ముగ్గురు పిల్లలున్నారు. భార్య లిఖితకు రూ.4 లక్షలు, మైనర్ పిల్లలకు రూ.1.33 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇతర బెనిఫిట్స్ తొందరలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని, శ్యాంసుందర్ కుటుంబానికి పోలీస్ శాఖ అన్నివిధాలుగా అండగా ఉంటుందని సీపీ అన్నారు.

ఉపాధి కల్పనకు పెద్దపీట

ఆమనగల్లు, జూన్ 26: రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అందివచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందుతూ మరికొందరికి ఉపాధి చూపాలని కోరారు. కలకొండ గ్రామానికి చెందిన మహిపాల్ ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి పథకాన్ని బుధవారం ఆమనగల్లు మాజీ మార్కెట్ చైర్మన్ భట్టు కిషన్ రెడ్డి , మాడ్గుల జడ్పీటీసీ గౌరవరం ప్రభాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులలతో కలిసి కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రారంభించారు. స్వయం ఉపాధి పథకాలు చేపట్టడానికి ప్రభుత్వంతో పాటు బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇవ్వాలని కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం అన్ని విధాల తోడ్పాటునందిస్తుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టిందని కసిరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా కోట మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

నందిగామ, జూన్ 26: మండలంలోని రంగాపూర్‌లోని కోట మైసమ్మ దేవాలయ మొదటి వార్షికోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఆలయ కమిటీ సభ్యులు వేదపండితుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో అభిషేకం, గణపతిపూజ, హోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిలు పాల్గొని పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, జడ్పీవైస్‌చైర్మన్ గణేష్, ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు రమేష్, ఆంజనేయులు, రాజగోపాల్, మహేందర్, శేఖర్, చంద్రశేఖర్, రవిందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తదితరులు

కొత్తూర్ పట్టణ సుందరీకరణకు కృషి

కొత్తూర్, జూన్ 26: కొత్తూర్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేసి నిధులు మంజూరు చేయిస్తానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. కొత్తూర్ చౌరస్తా నుంచి వైజంక్షన్ వరకు ఉన్న పాత జాతీయ రహదారిని బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కొత్తూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో వెనకపడిపోయిందన్నారు. పాత జాతీయ రహదారి గోతులమయంగా మారడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైజంక్షన్ నుంచి కొత్తూర్ చౌరస్తా వరకు 60 ఫీట్ల రోడ్డుతో పాటు, డివైడర్, బటర్‌ఫ్లై లైట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్‌బీ డిప్యూటీ ఈఈ రవి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

షాద్‌నగర్‌అర్బన్, జూన్ 26: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో పనిచేస్తున్న ఆర్‌ఐ ఎం. వెంకటెరెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసి, రీపోస్టింగ్ ఇవ్వాలని షాద్‌నగర్ టీఎన్‌జీవో తాలుకా నాయకులు బుధవారం స్థానిక తహసీల్దార్, ఆర్డీవోలకు వినతిపత్రాలు ఇచ్చారు. జిల్లా అధికారుల ఆదేశం మేరకు ఆర్‌ఐ వెంకటెరెడ్డి ఆదివారం కూడా పనిచేస్తున్న సమయంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ఆగ్రహంతో అక్కడికి వెళ్లి అసభ్య పదజాలంతో దూషించడం తగదని పేర్కొన్నారు.

పంటలను పరిశీలించిన డీఏవో

కొందుర్గు, జూన్ 26: మండల పరిధిలోని టేకులపల్లి లోని పంట పొలాలను బుధవారం జిల్లా వ్యవసాయాధికారిణి గీతారెడ్డి పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ పత్తి పంటలో వర్షాభావ పరిస్థితుల వల్ల విత్తనాలు మొలవనిచోట దాట్లు పెట్టుకోవాలని సూచించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. గ్రామంలో జనుము వేసిన రైతుల పొలాలతో పాటు మరో 15మంది రైతుల పొలాలను పరిశీలించారు.

ఎంపీడీవో, ఎంపీవో, ఎస్సైలకు సన్మానం

ఆమనగల్లు, జూన్ 26: ఆమనగల్లు ఎంపీడీవో, ఎంపీవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కుసుమ మాధురి, ఉమారాణిలను బుధవారం కేఎస్‌ఆర్‌యువసేన జిల్లా నాయకుడు విజయ్‌రాథోడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాలలు, శాలువాలతో వారిని సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి ఇందిర, నాయకులు శ్రీను నాయక్, తదితరులున్నారు. ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్, కడ్తాల సీఐ శివ ప్రసాద్ లు ఎస్సైగా ఏడాది కాలం విధులు నిర్వహించి కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన బాల్‌రామ్ నాయక్‌ను పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు అధికారులు, సిబ్బంది వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎస్‌ఐలు తదితరులున్నారు. బాల్‌రామ్ నాయక్‌ను కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు సత్కరించారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి : ఏబీవీపీ

షాద్‌నగర్/కేశంపేట/కందుకూరు/కొత్తూర్/షాబాద్/ఆమనగల్లు/మాడ్గుల/మొయినాబాద్ రూరల్/ఇబ్రహీంపట్నం/చేవెళ్ల , జూన్ 26: విద్యపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు, విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న వైస్ చాన్సలర్ పోస్టుల నియమాకాలు, అధిక ఫీజులను నియంత్రించాలని కోరుతూ ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన విద్యా సంస్థల బంద్ పిలుపు మేరకు బుధవారం షాద్‌నగర్ పట్టణంలో విద్యా సంస్థలను బంద్ చేయించారు. ఏబీవీపీ నాయకులు తదితరులున్నారు. ప్రైవేటు పాఠశాలలో ఫీజులను నియంత్రించాలని కేశంపేట మండల ఏబీవీపీ నాయకుడు నరేందర్ డిమాండ్ చేశారు. మండలంలో విద్యా సంస్థలను బంద్ చేయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందని ఏబీవీపీ కందుకూరు నగర కార్యదర్శి భానుప్రసాద్ అన్నారు. మండలంలోని అన్ని విద్యాసంస్థలను బంద్ చేయించారు. ఏబీవీపీ నాయకులు కొత్తూర్‌లో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలను బంద్ చేయించారు. మండల కన్వీనర్ నరేష్‌చారి మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్ అన్నారు.



చేవెళ్ల : స్కూల్ నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

షాబాద్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను బంద్ చేయించారు. ఆమనగల్లు పట్టణంలో బంద్ సంపూర్ణంగా ప్రశాంతంగా జరిగింది. ఏబీవీపీ నగర శాఖ కార్యదర్శి శివ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నాయకులు ర్యాలీ నిర్వహించారు. మాడ్గుల మండలంలోని పాఠశాలలను ఏబీవీపీ మండల శాఖ అధ్యక్షుడు దండు కార్తీక్ ఆధ్వర్యంలో బంద్ చేయించారు. ఏబీవీపీ రాష్ట్ర టెక్నికల్ సెల్ కోకన్వీనర్ రాకేష్ యాదవ్ మొయినాబాద్ మండలంలోని పాఠశాలలను ఏబీవీపీ నాయకులతో కలిసి బంద్ చేయించారు. ఏబీవీపీ పిలుపు మేరకు ఇబ్రహీంపట్నంలో పాఠశాలల బంద్ విజయవంతమయింది. ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ సంజీవరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై 15రోజులు కావస్తున్నా సరిపడా పాఠ్యపుస్తకాలు అందలేదన్నారు. చేవెళ్లలో పాఠశాలల బంద్ విజయవంతమైందని ఏబీవీపీ చేవెళ్లనగర కార్యదర్శి మైహిపాల్ చెప్పారు.

సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో భద్రత ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

శంషాబాద్ రూరల్, జూన్ 26 : మండల పరిధిలోని ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీసీపీ రాజేష్ బుధవారం సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నగర శివారు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, ఎలాంటి భద్రత ఏర్పాటు చేశారని పరిశీలించారు. సెక్యూరిటీ ఇన్‌చార్జి మోహన్‌రావుతో మాట్లాడి పలు సూచనలు చేశారు. చిన జీయర్‌స్వామి డీసీపీ రాజేష్‌కు శాలువ కప్పి సన్మానించారు. అనంతరం డీసీపీ శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. సీఐ నరేందర్‌రెడ్డిని పోలీస్ క్రైం వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఐ నరేందర్‌రెడ్డి, ఎస్సైలు భాస్కర్, నర్సింహారావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పశువైద్య కేంద్రానికి కుర్చీలు వితరణ

కొత్తూర్, జూన్ 26: స్థానిక పశువైద్య కేంద్రానికి మున్సిపాలిటీ కౌన్సిలర్ మాదారం నర్సింహగౌడ్ కుర్చీలు అందజేసి తన ఉదారతను చాటుకున్నాడు. మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో కుర్చీలు లేకపోవడంతో అక్కడికి వచ్చే రైతులతో పాటు, సిబ్బంది ఇబ్బందులు గురవుతూ వస్తున్నారు. ఈవిషయాన్ని గమనించిన కౌన్సిలర్ సొంత ఖర్చులతో 10 కుర్చీలను అందజేశారు. ఈసందర్భంగా నర్సింహగౌడ్‌కు పశువైద్యాధికారి స్ఫూర్తి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదారం అనురాధకృష్ణగౌడ్, జె. శ్రీను, వీరమోని శ్రీనివాస్, వెంకటేష్, మోర జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుర్చీలు అందిస్తున్న కౌన్సిలర్ నర్సింహగౌడ్

సంక్షిప్తంగా..

మొయినాబాద్ రూరల్ : మండల పరిధిలోని రెడ్డిపల్లికి చెందిన కావలి శ్రీనివాస్ గతేడాది అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి కుమారుడు సాకేత్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. అతడు చదువు అతని చదువు కోసం అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు మోర శ్రీనివాస్ ముందుకొచ్చి ప్రతీ సంవత్సరం రూ.10వేల ఆర్థిక సాయం చేస్తానని మాటిచ్చాడు. ఈమేరకు బుధవారం వారి కుటుంబానికి రూ.పది వేలు అందజేశాడు.

యాచారం : జల్‌జీవన్ పథకం కింద బోర్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని 2021-23లో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం దేశంలోని ప్రజాప్రతినిధులను కోరింది. దాంతో ఆనాడు తాటిపర్తి సర్పంచ్ దూస రమేష్, గున్‌గల్ సర్పంచ్ కె.ఇందిరలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. పది రోజుల్లో భూగర్భజల పరిశోధకులు సర్వేచేసి బోర్ వేసే ప్రదేశాన్ని గుర్తించారు. బుధవారం అధికారులు తాటిపర్తిలో పల్లెప్రకృతివనంలో, గున్‌గల్‌లో స్మశానవాటికలో బోర్‌లు డ్రిల్ చేసి పంచాయతీలకు అప్పగించారు.

కేశంపేట : విత్తన శుద్ధితోనే రైతులకు లాభం చేకురుతుందని అసిస్టెంట్ ప్లాంట్ ప్రొడక్షన్ అధికారులు డాక్టర్ స్వేత, పద్మలు సూచించారు. అల్వాల, కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లిలో మొక్కజొన్న పైర్లను వ్యవసాధికారులు పరిశీలించారు.

ఇబ్రహీంపట్నం : రాచకొండమైలారం ప్యాక్స్ ఆస్తులను కాపాడడమేగాక సంఘాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకుపోతున్నందుకుగాను ప్యాక్స్ చైర్మన్ బిట్ల వెంకటెరెడ్డి హెచ్‌డీసీసీబీ అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం నగరంలో జరిగిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సర్వసభ్య సమావేశంలో ఆయనకు ఈ పురస్కారం అందజేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో వేయి చదరపు గజాల స్థలం ఫ్యాక్స్‌కు వచ్చే విదంగా కృషి చేయడమేగాక రూ.30 లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం నిర్మించారు. అంతేగాక సర్వేనెం.101, 102లలో 3.30 ఎకరాల స్థలంలో రైతులకు అందుబాటులో మరో గోదాం, ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేసేందుకు ప్లాన్ రూపొందించారు. వీటిని పరిగణలోకి తీసుకొన్న హెచ్‌డీసీసీబీ ఆయనకు పురస్కారం అందించింది.

షాద్‌నగర్‌అర్బన్ : నాణ్యమైన విద్యాభ్యాసం కోసం విద్యార్థులు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి కోరారు. బాలానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు. ప్రిన్సిపల్ అంజన్‌కుమార్‌తో డిగ్రీ కళాశాలలోని సౌకర్యాలపై ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించి, విద్యార్థుతో మాట్లాడారు.

చౌదరిగూడ : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలకు కారకులైన ఉపాధ్యాయులు, ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ప్రగతి వెల్‌ఫేర్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. కొందుర్గు మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో చౌదరిగూడ మండలం ఇంద్రానగర్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులను అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ అలోక్ అగర్‌వాల్, జగదీశ్వర్‌ఉన్నారు.

ఆమనగల్లు : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవిని ఎన్‌ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి ఎండీ ఫరీద్, కడ్తాల, తలకొండపల్లి మండలాల ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షులు షాబోద్దీన్, రమేశ్‌నాయక్, నాయకులు కలిశారు. ఎంపీగా మల్లు రవి ప్రమాణ స్వీకారం అనంతరం ఢిల్లీలో ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలవాలతో సత్కరించారు.

షాద్‌నగర్ : షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్‌లింగ్ మరిన్ని సేవా పథకాలు పొందాలని పట్టణ మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు ఆశాభావం వ్యక్తం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ సేవా పథకానికి ఎంపికైన సీఐ ప్రతాప్‌లింగంను మహిళా కౌన్సిలర్లు అగ్గనూరు విశాల విశ్వం, కృష్ణవేణి, లతా శ్రీశైలం గౌడ్, సరితా యాదగిరి యదవ్ షాద్‌నగర్ స్టేషన్‌లో సన్మానించారు.

నందిగామ : వ్యవసాయశాఖ అదికారులు రైతులు పండించే పంట పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం నందిగామ మండల పరిదిలోని మామిడిపల్లి గ్రామంలోని రైతుల పొలాల్లో నందిగామ మండల వ్యవసాయశాఖ అధికారులు భూసార పరిక్షలు నిర్వహించారు. భూసారాన్ని తగ్గట్టుగా పంటలు వేయాలని అధికారులు వేయాలని సూచించారు. రైతులందరూ భూసార పరిక్షలు చేయించాలని అధికారులు సూచించారు.

ఆమనగల్లు : మంత్రి శ్రీధర్‌బాబును కడ్తాల మండలంలోని ఎక్వాయ్‌పల్లికి చెందిన యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటి అధ్యక్షుడు మహేష్‌గౌడ్ తో కలిసి మంత్రిని హైదరాబాద్‌లో కలిసి సత్కరించారు.

కొత్తూర్ : రోడ్లతోనే గ్రామాలాభివృద్ధి జరుగుతాయని స్థానిక ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్‌తండా, మల్లాపూర్ ఎస్సీ కాలనీల్లో మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలను ఎంపీపీ ప్రారంభించారు. పరిషత్ నిధులతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టడం

ఉన్నత విద్యకు ఎనలేని కృషి చేసిన భాస్కరరావు

- త్రిదండి చిన్నజీయర్‌స్వామి



కార్యక్రమంలో పాల్గొన్న చినజీయర్

మొయినాబాద్ రూరల్, జూన్ 26: జోగిన్‌పల్లి భాస్కరరావు ఎంతో మహోన్నత వ్యక్తి అని, ఉన్నత విద్యకు ఎనలేని కృషి చేశారని, పేద వారికి వైద్యం అందించేందుకు భాస్కర ఆసుపత్రిని కూడా ఏర్పాటు చేశాడని త్రిదండి చినజీయర్‌స్వామి అన్నారు. అమ్డాపూర్ చౌరస్తాలోని భాస్కర మెడికల్ కళాశాలలో భాస్కర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దివంగత భాస్కరరావు 10వ వర్థంతి సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చినజీయర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పేద ప్రజలు, విద్యార్థుల కోసం భాస్కర రావు విద్యాసంస్థలను ఏర్పాటు చేసి ఎంతో మంది జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను జేవీ కృష్ణారావు కొనసాగిస్తుండడం అభినందనీయమన్నారు. భాస్కర విద్యాసంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు, క్యాంపస్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టాలి




వెంకటేశ్వర్లును అభినందిస్తున్న పురుషోత్తంరెడ్డి

మొయినాబాద్ రూరల్, జూన్ 26: విద్యార్థులు చదువుతో పాటు పరిశోధనలపై దృష్టిపెడితే లక్ష్యాలను చేరేందుకు మార్గం సులభతరం అవుతుందని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కులపతి డాక్టర్ సీహెచ్ పురుషోత్తంరెడ్డి అన్నారు. మండలంలోని హిమాయత్ నగర్‌లో గల యూనివర్సిటీకి చెందిన వెంకటేశ్వర్లు వాణిజ్యం, వ్యాపారం నిర్వహణ విభాగంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఇన్ బ్యాంకింగ్ సెక్టార్ అనే అంశంపై ప్రొఫెసర్ కె.దీపశ్రీ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. పురుషోత్తంరెడ్డి యూనివర్సిటీలో బుధవారం అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి, వైస్ చాన్సలర్ క్రిస్టోఫర్, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయంతం చేయాలి

కందుకూరు, జూన్ 26: గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రేపు(శుక్రవారం) నిర్వహించే చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు సకాలంలో ఇవ్వకపోగా.. వెట్టి చాకిరీ చేయిస్తున్నట్లు ఆరోపించారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేస్తూ మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి పూర్వ విధానాన్ని కొనసాగించాలన్నారు. పంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 15 రోజుల క్రితం ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రాన్ని ఇచ్చినా స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు మండలంలోని అన్ని గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు సకాలంలో పాల్గొనాలని కోరారు.

మాజీ సర్పంచ్ మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్, జూన్ 26: మండలంలోని ముద్విన్ మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య మృతి పట్ల ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. బుధవారం గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతదేహంపై పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ దశరథ్ నాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనర్సింహ్మారెడ్డి, తదితరులున్నారు.